క్లుప్తంగా

అయ్యో పిల్లి..



పిల్లిని గోతిలో పూడ్చి నమస్కరిస్తున్న చిన్నారులు

దాబాగార్డెన్స్ : ఆ చిన్నారులు మానవత్వం చాటుకున్నారు. సాధారణంగా ఎక్కడైనా పిల్లి.. కుక్క.. ఇలా జంతువులేవైనా చనిపోతే.. పారిశుధ్య కార్మికుల చేతో.. లేదా ఇంకెవరితోనైనా చెత్త కుప్పల్లో పడేస్తారు. కానీ ఆ చిన్నారులు అలా చేయలేదు. అర్ధరాత్రి సమయంలో ఓ కుక్క ఒక పిల్లిని వెంబడించి కొరికేయడంతో.. అది మృత్యువాత పడింది. తెల్లవారి ఓ ఇద్దరు పిల్లలు స్కూల్‌కి వెళ్తుండగా ఇంటి మెట్లపై ఓ పిల్లి పడి ఉంది. ఆ పిల్లిని చూసి కొంత ఆవేదనకు గురయ్యారు. ఎవరూ ఆ చనిపోయిన పిల్లిని పట్టించుకోలేదు. స్కూల్ నుంచి వచ్చినప్పటికీ ఆ పిల్లి అక్కడే ఉండిపోవడాన్ని చూసిన ఆ చిన్నారులు.. కుటుంబ సభ్యులతో పక్కనే ఉన్న ఖాళీ స్థలంలో గొయ్యి తీయించి, ఆ గోతిలో పూడ్చి మానవత్వం చాటుకున్నారు.

జీవీఎంసీ కమిషనర్‌ను కలిసిన ఎమ్మెల్యే



కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి

దాబాగార్డెన్స్ : దక్షిణ నియోజకవర్గ పరిధిలో రోడ్ల విస్తరణ పనులు వేగవంతం చేసి, త్వరితగతిన పూర్తి చేయాలని ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ గురువారం జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మను మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. అలాగే 30వ వార్డులోని కల్యాణ మండపం నుంచి కోడి పంద్యాల వీధి వరకు 30 అడుగుల రోడ్డు విస్తరణ చేపట్టాలని ఆ వినతిలో పేర్కొన్నారు. కమిషనర్ సానుకూలంగా స్పందించారని ఎమ్మెల్యే తెలిపారు. కమిషనర్‌ను కలిసిన వారిలో ఎమ్మెల్యేతో పాటు మాసిపోగు రాజు ఉన్నారు.

కాలువలను శుభ్రం చేయించిన కార్పొరేటర్



రామకృష్ణ జంక్షన్ వద్ద మురుగు నీటి కాలువలను శుభ్రం చేయిస్తున్న విల్లూరి భాస్కరరావు

జగదాంబ : ఇటీవల కురిసిన వర్షాలకు మురుగు, చెత్తతో నిండిపోయిన కాలువలను గురువారం వార్డు కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు శుభ్రం చేయించారు. జీవీఎంసీ 35వ వార్డులో వర్షాల వల్ల కాలువలు, యూజీడీ డ్రైన్లు, కల్వర్టులు పూర్తిగా నిండిపోయాయి. దీని వలన మురుగు నీరు పొంగిపొర్లింది. బురద కూడా పేరుకుపోవటంతో దుర్వాసన, దోమల వ్యాప్తితో ప్రజలు నానా అవస్థలు పడ్డారు. ఈ నేపథ్యంలో కార్పొరేటర్ విల్లూరి తక్షణ చర్యలు తీసుకుని కాలువలు, కల్వర్టులను శుభ్రం చేయించారు. శానిటరీ సిబ్బందితో బ్లీచింగ్ చల్లించారు. ఈ కార్యక్రమంలో వార్డు వైఎస్సార్‌సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సెప్టెంబర్‌లో వైజాగ్ స్టార్ టాలెంట్ షో

దాబాగార్డెన్స్ : అంతర్జాతీయ ఈవెంట్ డైరెక్టర్ వీరుమామ, వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ సంయుక్త ఆధ్వర్యంలో విశాఖలో అతిపెద్ద టాలెంట్ షో సెప్టెంబర్‌లో నిర్వహించనున్నట్లు వీరుమామ ఒక ప్రకటనలో తెలిపారు. ఐదు నుంచి ముప్పై ఐదు సంవత్సరాల వయసు వారికి మోడలింగ్, సింగింగ్, డ్యాన్సింగ్, యాక్టింగ్, యాంకరింగ్ విభాగాల్లో నిర్వహించనున్న ఈ షోలో పాల్గొనే వారు ముందుగా రిజిస్టర్ చేసుకోవాలని, మరిన్ని వివరాలకు 7207340513 నంబరులో సంప్రదించాలని తెలిపారు.

జగనన్న సురక్ష.. సరికొత్త చరిత్ర

అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా పాలన సాగిస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో ఉన్న లబ్ధిదారులందరికీ మేలు చేయాలనే సదాశయంతో 'జగనన్న సురక్ష' అనే వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ అన్నారు. ఇప్పటి వరకు దేశ చరిత్రలో ఏ రాష్ట్రంలోనూ ఇటువంటి కార్యక్రమం రూపొందలేదని.. ఇంతటి అభివృద్ధి జరగలేదని ఆయన స్పష్టం చేశారు.

- లబ్ధిదారులకు అందిన శత శాతం సంక్షేమ ఫలాలు
- నెల రోజులు నిర్వహించిన కార్యక్రమానికి విశేష స్పందన
- తక్కువ వ్యవధిలో ఎక్కువ సేవలు అందజేత
- సురక్ష కార్యక్రమంపై సమీక్షలో ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్



జగనన్న సురక్ష కార్యక్రమంపై మాట్లాడుతున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్

దాబాగార్డెన్స్ : ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో దక్షిణ నియోజకవర్గంలో గల 14 వార్డుల్లో నెల రోజుల పాటు 65 క్యాంపులు నిర్వహించి, 66,327 కుటుంబాలను సందర్శించి, 21,131 సర్టిఫికెట్లు లబ్ధిదారులకు అందజేసినట్లు ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ పేర్కొన్నారు. జగనన్న సురక్ష ద్వారా అధికారులు, నాయకులను ప్రజలకు చేరువ చేసి అనేక సమస్యలకు శాశ్వత పరిష్కారం కల్పించినందుకు ముఖ్యమంత్రికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఆశీల్‌మెట్ట సమీపాన అశోక్‌నగర్‌లో గల ఎమ్మెల్యే కార్యాలయంలో నెల రోజుల పాటు సాగిన జగనన్న సురక్ష కార్యక్రమానికి సంబంధించి నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో 15,004 సచివాలయాల ద్వారా 1 కోటీ 46 లక్షల 27 వేల 905 కుటుంబాలను కలుసుకుని, 93 లక్షల 57 వేల 707 సమస్యలను పరిష్కరించినట్లు తెలిపారు. జగనన్న సురక్ష సరికొత్త చరిత్ర సృష్టించిందన్నారు.

98.3 శాతం హామీలు అమలు..

సీఎం జగన్ అధికారంలోకి రాక ముందు ప్రజలకు ఇచ్చిన హామీల్లో సుమారు 98.3 శాతం హామీలు అమలు చేశారని కొనియాడారు. మిగిలినవి కూడా పరిష్కరించాలన్న ఉద్దేశంతో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని రూపొందించినట్లు తెలిపారు. ప్రజలు ఎలాంటి సమస్యలతో ఇబ్బంది పడుతున్నారో వలంటీర్లు వాటిని నమోదు చేసుకుని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి నెలరోజుల్లో సమస్యలు పరిష్కరిస్తారన్నారు. ప్రతి ఒక్కరికీ నేరుగా అక్కడికక్కడే సత్వర పరిష్కారం జరిగిందన్నారు. ఇంత గొప్ప కార్యక్రమం ఏర్పాటు చేసిన ముఖ్యమంత్రి ఆలోచన హర్షించదగ్గ విషయమన్నారు. సమావేశంలో ఎమ్మెల్యేతో పాటు కనకమహాలక్ష్మి దేవస్థానం చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, కార్పొరేటర్లు విల్లూరి భాస్కరరావు, కోడూరు అప్పలరత్నం, జీవీఎంసీ కోఆప్షన్ సభ్యుడు మహ్మద్ షరీఫ్, కోడిగుడ్ల శ్రీధర్, మాసిపోగు రాజు, పీతల వాసు, అలపన కనకరెడ్డి, దశమంతుల మాణిక్యాలరావు, శంకాభక్తుల సన్యాసిరావు, బాపు ఆనంద్, సనపల రవీంద్రభరత్, ప్రసాదరావు, జేసీఎస్ ఇన్‌చార్జి కర్రి నీలకంఠం, పెంటపల్లి సత్యనారాయణ, లింగం శ్రీను, బొగ్గు శ్యామ్, లండా రమణ, ఆదివిష్ణు, బోని దేవా, ముజీబ్‌ఖాన్, కోన శంకర్, బొడ్డేటి ప్రసాద్, ఆరుగుల రాజు, సాగర్, రామరాజు తదితరులు పాల్గొన్నారు.

గొయ్యి పూడ్చివేత



వర్షానికి ఏర్పడిన గొయ్యి (పాతచిత్రం)



సిమెంట్‌తో మూసిన గొయ్యి

జగదాంబ : జీవీఎంసీ 35వ వార్డు ప్రధాన రహదారిలో ఏర్పడిన గొయ్యిని జీవీఎంసీ అధికారులు సిమెంట్‌తో మూయించారు. ఇటీవల కురిసిన వర్షానికి వార్డులోని 75 అడుగుల రోడ్డులో యూజీడీ మ్యాన్‌హోల్ పక్కనే పెద్ద గొయ్యి ఏర్పడింది. దీంతో ఆ దారిపై ప్రయాణం ప్రమాదకరంగా మారడంతో ఎవరూ రాకపోకలు సాగించటంలేదు. ఈ నేపథ్యంలో సాక్షిలో ×ప్రమాదకరంగా గొయ్యి¥ అనే శీర్షికన వార్త వెలువడడంతో గురువారం అధికారులు ప్రధాన రహదారిపై గల గోతిని పూడ్చి రాకపోకలకు అవకాశం కల్పించారు.

పలువురికి సీతంరాజు ఆర్థిక సాయం



బాధితులకు ఆర్థిక సహకారం అందజేస్తున్న పచ్చిరిపల్లి రాము తదితరులు

అల్లిపురం : ఆపదలో ఉన్నవారికి అండగా దక్షిణ నియోజకవర్గం నాయకులు సీతంరాజు సుధాకర్ ఆర్థిక సహకారం అందజేశారు. బంగారుమెట్ట కాలనీలో క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న సీహెచ్ వెంకట నాగేశ్వరరావు, సింహాలదేవిడి ప్రాంతంలో హృద్రోగంతో బాధపడుతున్న ఎం.పావని, కుమ్మరి వీధిలో కంటి సమస్యతో బాధపడుతున్న ఎం.వెన్నీ, షుగర్ వ్యాధితో ఒక కాలు పోగొట్టుకున్న డి.విజయ, జీవీఎస్ సిండ్రోమ్‌తో బాధపడుతున్న అమ్మవారి వీధికి చెందిన టి.సాయికిరణ్‌కు సీతంరాజు సుధాకర్ తరఫున 33వ వార్డు నాయకుడు పచ్చిరిపల్లి రాము, పీవీ నరసింహారెడ్డి, పోలవరపు ప్రసాద్ గురువారం ఆర్థిక సహకారం అందజేశారు. ఈ కార్యక్రమంలో కె.పైడిరాజురెడ్డి, విశ్రాంత ఎస్‌ఐ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యం



తప్పిపోయిన సింగంపల్లి మాధవి

అల్లిపురం : వెంకటపతిరాజు నగర్‌కు చెందిన సింగంపల్లి మాధవి (37) గత కొంతకాలంగా మానసికంగా ఇబ్బంది పడుతోంది. ఆమెకు గతంలో నాలుగుసార్లు ఆపరేషన్లు జరిగాయి. మందులు అధికంగా వాడటంతో వికారంగా ప్రవర్తిస్తుండేది. ఈ నెల 2వ తేదీన ఆమెను తల్లి మందలించింది. దీంతో ఆమె మూడు జతల బట్టలు పట్టుకుని ఇంటి నుంచి వెళ్లిపోయింది. విషయం తెలుసుకుని నగరంలో పలు ప్రాంతాల్లో వెదికినా ఆచూకీ తెలియకపోవటంతో ఆమె తల్లి విజయలక్ష్మి మహారాణిపేట పోలీసులకు గురువారం ఫిర్యాదు చేయటంతో సీఐ రమణమూర్తి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. తప్పిపోయిన మహిళ ఆచూకీ 0891–2746866, 9440796010 ఫోన్ నంబరులో తెలియజేయాలని కోరారు.

ముంపుతో అవస్థలు

- వర్షం వస్తే మురుగు, చెత్తతో రామకృష్ణానగర్ వాసుల వెతలు
- శాశ్వత పరిష్కారం చూపాలంటూ అభ్యర్థన



ముంపునకు గురయ్యే రామకృష్ణానగర్



ఇటీవల కురిసిన వర్షంతో నిలిచిపోయిన వాన

జగదాంబ : ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం కల్పించాలని రామకృష్ణనగర్ ప్రాంతీయులు కోరుతున్నారు. 39వ వార్డు పోర్టు ప్రధాన ద్వారం పక్కనే ఉన్న తమ ప్రాంతం ఏ చిన్నపాటి వర్షం కురిసినా ముంపునకు గురవుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జగదాంబ.. ఆ పైన ఉన్న ప్రాంతాలు, కేజీహెచ్, ఏవీఎన్ కళాశాల ఎగువన ఉండే ప్రాంతాల నుంచి వచ్చే మురుగు నీరంతా రామకృష్ణానగర్ పక్కనే ఉన్న ఎస్‌ఎల్ కెనాల్ నుంచి సముద్రంలోకి ప్రవహిస్తుంటుంది. రామకృష్ణానగర్ లోతట్టు ప్రాంతం కావడంతో కెనాల్‌లో నీటి ప్రవాహానికి ఏది అడ్డంకిగా మారినా మట్టి, చెత్త పొంగిపొర్లి రామకృష్ణానగర్ అంతా మురుగు, చెత్తతో నిండిపోతుంటుందని.. ఇళ్లలోకి నీళ్లు వస్తుంటాయని స్థానికులు వాపోతున్నారు. గత కొన్ని సంవత్సరాలుగా ఇదే పరిస్థితితో ఎన్నో ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యతో చాలా మంది స్థానికులు ఇళ్లు ఖాళీ చేసి వెళ్లిపోయారని తెలిపారు. అదే విధంగా రామకృష్ణానగర్ ఎదురుగా 160 వరకు టిడ్కో ఇళ్లు ఉన్నాయి. ఇవి దాదాపు ఎస్‌ఎల్ కెనాల్‌కు ఆనుకుని ఉండటంతో అక్కడా ఈ సమస్య ఉందని చెబుతున్నారు.

నిద్ర లేని రాత్రులు గడుపుతున్నాం..



చిన్న వర్షానికి కూడా రామకృష్ణానగర్ ముంపునకు గురవుతుంది. దీని వలన ఇళ్లలోకి నీళ్లు వచ్చేస్తాయి. ఆ నీటిని పూర్తిగా తోడాలంటే రెండు రోజుల సమయం పడుతుంది. పిల్లలు, ముసలి వాళ్లతో నిద్రలేని రాత్రులు గడుపుతున్నాం. అధికారులు వెంటనే చర్యలు తీసుకుని మురుగు నీరు ఇళ్లలోకి రాకుండా చర్యలు తీసుకోవాలి.

–ఆర్‌కే శివ, రామకృష్ణానగర్, 39వ వార్డు.

ఏటా ఇదే దుస్థితి..



వర్షం వచ్చిన ప్రతిసారీ మా ఇళ్లలోకి నీరు వచ్చేస్తుంటుంది. అలా వచ్చిన వర్షం నీటిని బయటికి తోడుకుంటాం. అయితే బురద ఉండిపోయి దుర్వాసన వస్తూనే ఉంటుంది. పూర్తిగా తడి ఆరాలంటే గట్టిగా రెండు రోజులు ఎండ కాయాలి. అంతే కాకుండా వ్యాధులు కూడా భయపెడుతుంటాయి. ప్రతి ఏటా ఇలాగే ఇబ్బందులు పడుతున్నాం. మా సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలి.

–రంగాయమ్మ, 39వ వార్డు.

రక్షణ చర్యలు తీసుకుంటాం..



రామకృష్ణానగర్‌లో ఉంటున్న వారి రక్షణకు చర్యలు తీసుకుంటాం. ముందుగా ఎస్‌ఎల్ కెనాల్‌పై ఎటువంటి నిర్మాణాలు చేయకుండా పోర్టు అధికారులతో మాట్లాడాం. అదే విధంగా జీవీఎంసీ నుంచి ఎప్పటికప్పుడు సిల్ట్ (మట్టి) పూడికలు తొలగిస్తాం. ఈ ప్రాంతాల ప్రజల రక్షణకు మేయర్ హరి వెంకట కుమారి, కమిషనర్ సాయికాంత్‌వర్మతో చర్చించి చర్యలు తీసుకుంటాం.

–మహ్మద్ సాధిక్, 39వ వార్డు కార్పొరేటర్.

బాధితులకు అండగా..




ఆర్థిక సాయం అందజేస్తున్న కార్పొరేటర్ చెన్నా జానకిరామ్

దాబాగార్డెన్స్ : జీవీఎంసీ 37వ వార్డులో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న పలువురికి ఆ వార్డు కార్పొరేటర్ చెన్నా జానకిరామ్ పార్టీ నాయకుడు సీతంరాజు సుధాకర్ సహకారంతో ఆర్థిక సాయం అందజేశారు. వార్డు పరిధి దిగువ రెల్లివీధికి చెందిన దివ్యాంగుడు వడ్డాది త్రినాథ్‌కు రూ.8వేలు, మూర్ఛ వ్యాధితో బాధపడుతున్న ఆరిసిల్లి శంకరమ్మకు రూ.4 వేలు, అంధత్వంతో బాధపడుతున్న అప్పలనాయుడుకు రూ.4 వేలు, క్యాన్సర్‌తో మంచం పట్టిన బొమ్మలు జస్మితకు రూ.4 వేలు, లంగ్ ఇన్‌ఫెక్షన్‌తో బాధపడుతున్న సురపతి దుర్గయ్యకు రూ.5 వేలు అందజేశారు. కార్యక్రమంలో ఆకుల ఏసు, రెయ్యి రేవతి డేవిడ్‌రాజు, కాసారపు వాసు, వెంకటలక్ష్మి, నిమ్మకాయల ఆదిలక్ష్మి, రోజా, రమణి, కన్వీనర్లు సారిక దైవకుమార్, ఆనంద్, రమణ, శేఖర్, శివ, శ్రీను, ఆర్పీలు వసుంధర, పార్వతి, గుర్ర లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

'కరికులం ఫర్ విజువల్లీ చాలెంజ్డ్' పుస్తకావిష్కరణ

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం విద్యా విభాగాధిపతి డాక్టర్ టి.షారోన్‌రాజు, డాక్టర్ ఎం. వి.ఎస్.ఎస్ ప్రకాషరావు సంయుక్తంగా రచించిన 'కరికులం ఫర్ విజువల్లీ చాలెంజ్డ్' పుస్తకాన్ని వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి గురువారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పుస్తక రచయితలను వీసీ అభినందించారు. ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులకు ఉపయుక్తంగా పాఠ్యప్రణాళిక రచన చేయడం మంచి పరిణామమన్నారు.

17 నుంచి కుంకుమ పూజలు



అమ్మవారి ఆలయంలో శ్రీచక్రం

సీతమ్మధార: ఈ నెల 17 నుంచి సెప్టెంబర్ 17 వరకు సీతమ్మధార నార్త్ ఎక్స్‌టెన్షన్‌లోని మహాగణపతి, ప్రసన్న వేంకటేశ్వర స్వామి, అయ్యప్ప, షిర్డీ సాయిబాబా దేవాలయంలో కొలువైన మహాలక్ష్మి దుర్గమ్మ వారి ఆలయంలో శ్రీచక్రానికి కుంకుమ పూజలు నిర్వహించనున్నట్లు ప్రధాన అర్చకుడు రాజాస్వామి తెలిపారు. సాయంత్రం 5.30 గంటల నుంచి పూజలు చేస్తామన్నారు. ఈ నెల 4,13 తేదీల్లో త్రయోదశి సందర్భంగా రామలింగేశ్వర స్వామికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహిస్తామని చెప్పారు.

మళ్లీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డే

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు



కోలా గురువులును సత్కరిస్తున్న నాయకులు

అల్లిపురం : రేణుక యల్లమ్మ అమ్మవారి ఆశీస్సులతో 2024లో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి అవుతారని, వారికి విశాఖ జిల్లాలో అన్ని నియోజకవర్గాలు గెలిచి బహుమతిగా అందివ్వాలని డీసీసీబీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, రాష్ట్ర మత్స్యకార కార్పొరేషన్ చైర్మన్ కోలా గురువులు అన్నారు. గురువారం ఆయన అల్లిపురంలోని కెప్టెన్ రామారావు జంక్షన్‌లో గల రేణుక యల్లమ్మ అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ గౌరవాధ్యక్షుడు పీల వెంకట అప్పలనాయుడు, ఆలయ అధ్యక్షుడు కర్రి నీలకంఠం, కార్యదర్శి బొడ్డు పోలారావు, కోశాధికారి వాసుపల్లి నారాయణ, కమిటీ సభ్యులు పంపాన గణేష్‌తో పాటు 34వ వార్డు నాయకులు లండా రమణ, లింగం శ్రీనివాసరావు, పార్టీ నాయకుడు, పార్లమెంట్ జిల్లా కార్యదర్శి బొడ్డేటి ప్రసాద్, టెలికాం అడ్వైజరీ కమిటీ సభ్యుడు పాల శ్రీహరిరెడ్డి, నీలాపు అయ్యప్పరెడ్డి ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆయన అమ్మవారికి పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులతో పాటు పార్టీ నాయకులు ఆయనను గజమాల, పూల కిరీటంతో సత్కరించారు. అనంతరం గురువులు మాట్లాడుతూ అమ్మవారి దీవెన, ముఖ్యమంత్రి సహకారంతో తనకు అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నిర్వహిస్తానన్నారు. అందుకు తనకు పార్టీలో నాయకులు, కార్యకర్తలు సహకరించాలని కోరారు. అనంతరం ఆయన అమ్మవారి సన్నిధిలో ప్రతి గురువారం నిర్వహించే అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మహిళలకు చీరలు పంపిణీ చేశారు.

సిరులతల్లికి సహస్ర తులసిపూజ



సహస్ర తులసి పూజలో కనకమహాలక్ష్మి

దాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మికి గురువారం సహస్ర తులసిపూజ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. అలాగే పంచామృతాభిషేక సేవ, శ్రీచక్రనవావర్ణార్చన లక్ష్మీహోమంలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. పై ప్రత్యేక పూజలో పరోక్ష పద్ధతిలో పాల్గొనే ఆసక్తి గల భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 806081లో పూజా రుసుము చెల్లించవచ్చు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, పలువురు ధర్మకర్తలు, ఆలయ ఏఈవో తిరుమలేశ్వరరావు, ఆలయ పర్యవేక్షకులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు క్షీరాభిషేక సేవ..

కనకమహాలక్ష్మికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించనున్నారు. ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.500 చెల్లించిన యెడల పూజకు దంపతులను లేదా ఇద్దర్ని అనుమతించనున్నారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు 0891–2566514, 2711725 నంబర్లలో సంప్రదించవచ్చు.

అక్టోబర్ 8న వైజాగ్ జూ మారథాన్



మారథన్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

దాబాగార్డెన్స్ : వైజాగ్ ట్రైల్ రన్నింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అక్టోబర్ 8న వైజాగ్ జూ మారథాన్ నిర్వహించనున్నట్టు కార్యక్రమ నిర్వాహకులు కీర్తి మహాజన్, కృష్ణ చైతన్య తెలిపారు. ఈ మేరకు గురువారం నగరంలోని ఓ హోటల్లో మారథాన్‌కు సంబంధించిన పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇందిరాగాంధీ జులాజికల్ పార్క్ నుంచి ఈ మారథాన్ ఉంటుందని, ఇందులో 4 రకాలున్నాయన్నారు. 21కే, 10కే, 5కే, 3కే పేరిట ఈ పోటీలు ఉంటాయన్నారు. మారథాన్‌లో పాల్గొనే క్రీడాకారులు, నగర ప్రజలు, ఆసక్తి గల వారంతా ముందుగా డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.వీటీఆర్‌ఏ.రన్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. అలాగే 76వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 15న మారథాన్ రన్ కూడా నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు యోగేష్, కార్యదర్శి ఎం. రవి తదితరులు పాల్గొన్నారు.

ఆసుపత్రికి వెళ్లి పింఛన్ అందజేత



కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న వ్యక్తికి పింఛన్ అందజేస్తున్న వలంటీరు శాంతి



పెన్షన్ అందజేస్తున్న వలంటీర్ సుబ్రహ్మణ్యం

జగదాంబ : జీవీఎంసీ 35వ వార్డులో ఒకటో తేదీ నుంచే పింఛన్ల పంపిణీ జరిగింది. ఒక్క రోజులోనే 98 శాతం పింఛన్లను వలంటీర్లు పంపిణీ చేశారు. మిగిలిన లబ్ధిదారులు ఇంటి వద్ద లేకపోవటంతో వారు ఎక్కడున్నారో తెలుసుకుని అందజేస్తున్నారు. అందులో భాగంగా గురువారం వార్డులో చింతపల్లి వీర్రాజు అనే వ్యక్తి కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్నాడన్న విషయం తెలుసుకుని వలంటీర్ శాంతి వెళ్లి అందజేశారు. దీంతో లబ్ధిదారు సంతోషం వ్యక్తం చేశారు.

డయాలసిస్ పేషెంట్లకు..

దాబాగార్డెన్స్ : కిడ్నీ వ్యాధితో బాధపడుతూ కేజీహెచ్‌లో డయాలసిస్ చికిత్స పొందుతున్న జీవీఎంసీ 36వ వార్డుకి చెందిన మంగమ్మ, సుధారాణికి ఆ వార్డు సచివాలయ వలంటీర్ సుబ్రహ్మణ్యం గురువారం సూపర్ స్పెషాలిటీ వార్డుకు వెళ్లి పెన్షన్ అందజేశారు.

బాలికా విద్యతోనే అభివృద్ధి



మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవప్రాధికార సంస్థ కార్యదర్శి ఎం.వి.శేషమ్మ

విశాఖ లీగల్ : బాలికా విద్యతోనే దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని విశాఖ జిల్లా న్యాయ సేవా ప్రాధికార సంస్థ కార్యదర్శి ఎం.వి.శేషమ్మ అన్నారు. గురువారం ఆమె పాతపోస్టాఫీసు వద్ద ఉన్న క్వీన్‌మేరీ హైస్కూల్‌ను సందర్శించారు. పాఠశాలలో వసతులను పరిశీలించారు. అనంతరం విద్యార్థినులను ఉద్దేశించి మాట్లాడారు. సంపదను దోచుకెళ్లొచ్చు కానీ చదువును ఎవరూ దోచుకెళ్లలేరని చెప్పారు. సమాజ ఉన్నతికి చదువు దోహదపడుతుందని చెప్పారు. డబ్బు ఎంత వాడితే అంత ఖర్చవుతుందని, ఎంత చదివితే అంత విజ్ఞానం పెంపొందుతుందని తెలిపారు. బాలికలకు చదువుతోపాటు ఆటలు, వ్యాయామం వంటి అంశాల్లోనూ అవగాహన కల్పించాలన్నారు.

సాధారణ ప్రయాణికుల పాట్లు

తాటిచెట్లపాలెం: రైళ్లలో ప్రయాణించే సాధారణ ప్రయాణికులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. రైల్లో నిల్చోలేరు..కూర్చోలేరు. కనీసం మరుగుదొడ్లకు, మూత్రవిసర్జనకు కూడా వీలులేని పరిస్థితి. గురువారం భాగల్‌పూర్ నుంచి బెంగళూరు వెళ్తున్న సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ గురువారం మధ్యాహ్నం విశాఖ చేరుకుంది. అంతే అప్పటివరకు ఎంతో ఓపిగ్గా ఎదురు చూసిన సాధారణ ప్రయాణికులు ఒకరివెంట ఒకరు రైలు దిగి ట్రాక్‌ల వెంబడి మూత్రవిసర్జన కోసం పరుగులు తీశారు. ట్రాక్‌లపై మూత్రవిసర్జన చేయడం ప్రమాదం, నేరం అని తెలిసి కూడా వేరే దారి లేక బోగీల్లో బాత్రూంలోకి ప్రవేశించడానికి అవకాశం లేక ఇలా చేయడం రైల్వే అధికారుల నిర్లక్ష్యాన్ని ప్రశ్నించినట్టు అయింది.